ఉగాది కొంటె కథలపోటీలో సాధారణ ప్రచురణకు ఎన్నికైన కథ

# వీడియో పెళ్ళి



'కామేశ్వరమ్మొదినా! నే విన్నది నిజమేనా?' పెళ్ళిసారెకోసం మినప సున్నుండలు నొక్కుతున్న వెంకటలక్ష్మి అడిగింది.

'ఏమిటమ్మా' అరిసెల పాకం పట్టి చూస్తున్న కామేశ్వరమ్మ మొహంలో ప్రశ్నార్థకం.

'మగపెళ్ళివారు వీడియో తీస్తున్నారటగా!'

'అంటే?'

'అంటే సినిమాల్లో నాగేశ్వరరావు, చిరంజీవి, ఎన్టీరామారావు వేస్తున్నట్టు మన మునసబుగారమ్మాయి పెళ్ళి అంతా సినిమాలా బొమ్మ దిగడమన్నమాట.'

'అంటే మనమంతాకూడా ఆ సినిమాలో పడతామంటారా?' ఆశ్చర్యంలో వెంకటలక్ష్మి చెంపలు కాశ్మీరులోయల్లా దిగిపోయాయి లోతుగా

'ఎందుకు పడమొదినా కాస్త జాగ్రత్తగా పెళ్ళికొడుకు వెనకాలో, పెళ్ళికూతురు వెనకాలో చోటు సంపాదించామంటే సినిమా అంతా మనమే ఉంటాం'

ఇది కేవలం పెళ్ళివారి వంటింటి సంభాషణ మాత్రమే కాదు. ఆ పల్లెటూళ్ళో ఎవరినోట విన్నా ఇదే టాపిక్.

వీడియోలో పడిపోవాలనే సంబరంతోనే కాబోలు వీరరాజు పాతపగలుకూడా మర్చిపోయి మునసబు కూతురు పెళ్ళి పనులు మహాజోరుగా చేసేస్తున్నారు.

'వీడియో అనేసరికి రోజూ ముప్పై స్నార్లు మూలిగే మా ముత్తవ్వ కూడా పాత ట్రంకు పెట్లోంచి ఇక్ష్వాకుల కాలంనాటి పట్టుచీర పైకి తీసి దులిపి చెంబిస్త్రీ చేసి తయారైపోతోంది రోయ్!'

పి.వి.శేషారత్నం

'మరి సినిమా దిగడమంటే మాటలేటి? మనమంతా శోభన్‌బాబులాగా, జయసుధలాగా పడిపోము!'

'మనమాట సర్లేవోయ్! అరవయ్యేళ్ళ వెంకట నాయుడు వారంరోజులబట్టి జొరంతో మూలుగుతున్నా లేచి జుట్టుకీ మీసాలకీ నల్లరంగేసేసి నిగనిగలాడిపోతున్నాడు?

* * * *

అంతా వెయ్యికళ్ళతో ఎదురుచూసిన మునసబుగారమ్మాయి పెళ్ళిరోజు వచ్చేసింది. మగపెళ్ళివారికంటే కూడా వీడియో తీసే కుర్రాళ్ళకి మినిస్టర్ల లెవెల్లో మర్యాదలు జరిగిపోతున్నాయి. పెళ్ళికి పక్క ఊళ్ళనుంచి కూడా జనం తండోపతండాలుగా దిగుతుంటే మగపెళ్ళివారికి మతిపోయింది.

పెళ్ళి మరొక అరగంటకి మొదలవుతుందనగా పెళ్ళికొడుకూ కొంతమంది మగపెళ్ళివారూ మళ్ళీ కారెక్కి కూర్చుంటూంటే ఆడపెళ్ళివారు హడలిపోయి కారుని చుట్టుముట్టేశారు ఏం కోపాలొచ్చాయో ఏంటోనని.

'జరగండెహె! వీడియో షూటింగ్ మొదలయింది'— ఎవరో వీడియో కెమెరాలని చూసి అరిచారు. అంతే తొక్కిసలాట మొదలై ఎదురు సన్నాహాల సీనుకి కొందరు ఆడపెళ్ళివారు కూడా చడీ చప్పుడు లేకుండా మగపెళ్ళివారి వెనకాల చేరిపోయారు బాగా పడాలని.

పెళ్ళికొడుకు ఫుల్‌సూట్‌లో చిరునవ్వుతో దిగుతూంటే కాల్గేట్ టూత్‌పేస్ట్ అడ్వర్‌టైజమెంటులా వెనకాల వాళ్ళుకూడా ఇకిలిస్తూ దిగారు.

### ఎదుగురెదుటా చెప్పనా..



భార్య అంది భర్తతో.

"ఇది అన్యాయం... మన వివాహ వేదిక మీద నన్నెప్పుడూ ప్రేమిస్తానని, గౌరవిస్తానని, నేను చెప్పినట్లు చేస్తానని ప్రమాణం చేశారు.. మరచిపోయారా?"

"అప్పుడు అందరి ఎదుటా వాదనలు పెట్టుకోవడం బాగుండదని అలా చెప్పాను" నింపాదిగా అన్నాడు భర్త.

—కె.వి.మధుసూధనరావు, కాకినాడ

ఇక పెళ్ళి మొదలవగానే అంతా పెళ్ళికొడుకు వెనకాల చేరిపోవాలని ఎగబడిపోవడం మొదలెట్టారు. కాని హైద్రాబాద్ డబల్ డెక్కర్లలా పెళ్ళికొడుకు అక్కగారు, పెద్దవదినగారు, తల్లి ఊరంత స్థలం ఆక్రమించి పెళ్ళికొడుకుని తుమ్మబంకలా అతుక్కుని కూర్చున్నారు. వాళ్ళ వెనకాలే అన్నగార్లు, బావగార్లు మిగతా బంధువర్గం సీట్లు రిజర్వు చేసుకున్నారు. ఆడపెళ్ళివారికి మహానిరాశగా ఉంది.

వీడియో కుర్రాళ్ళు ఎంతసేపూ పెళ్ళికొడుకు వైపే లైటు తిప్పుతుంటే అక్కడ చోటు దొరకని వాళ్ళంతా లోలోపల కుతకుతలాడిపోతున్నారు.

ఎవరో పెళ్ళికూతురు గౌరీ పూజకూడా సినిమా తియ్యాలని సలహా ఇచ్చేలోగా ఆ కార్యక్రమం అయ్యేపోయింది. కెమెరా జ్యోతులు పట్టుకుని జిగేల్ జిగేల్మని ఆరు కేజీల వెండి జరీ చీరతో మెరిసిపోతూ వస్తున్న పెళ్ళికూతురివైపు తిరిగింది.

మళ్ళీ తొక్కిసలాట మొదలయి మేడమీద పందిట్లో కళ్యాణమండపం చుట్టూ కూర్చున్న ఆడపెళ్ళివారంతా లేచిపోయి పెళ్ళికూతురు వెనకాల చేరిపోవటం మొదలెట్టారు. ఈ హడావుడిలో ఎవరో ఒక్కతోపు తోసేసరికి పెళ్ళికూతురు కాస్తా బోర్లాపడిపోయింది. అయినా ఎవరూ ఆ పిల్లను లేవనెత్తేందుకు అడుగు ముందుకు కదల్చలేదు. చిరునవ్వులు చిందిస్తూ కెమేరావైపే చూస్తూండి పోయారు. చివరికి వీడియో కుర్రాడికి విసుగొచ్చి కెమేరా తిప్పేశాడు.

మధుపర్కాలు కట్టుకోనని పేచీపెట్టి తెలుగు సినిమాల్లో ఖరీదైన హీరో నైట్ సిల్క్ డ్రెస్‌లాంటి జిగేల్మనే బ్లూ సిల్క్ కుర్తా, షర్టులో పీటలమీద కూర్చున్న పెళ్ళికొడుకు విచిత్ర వేషగాడులాగున్నాడు.

పందిట్లో ఎవరో గుసగుసలాడారు.

'ఈ వీడియో కాదుగాని పెళ్ళిచేయించే పంతులుగారుకూడా పేంటూ షొక్కా వేసుకుని తయారయితే పెళ్ళికొడుకు తండ్రి ఇదేం సినిమా షూటింగా? సంప్రదాయంగా లేకుండా ఏమిటీ వరస అని' పోట్లాడాడుట.

'పెళ్ళికొడుకు అక్కగారు ముక్కోపి అని విన్నాం. అదేమిటమ్మా ముసి ముసి నవ్వులు చిందిస్తూ బైఠాయించింది?'

'వీడియోనా మజాకానా? పొద్దుట మొగుడికి టిఫిన్ వేడిగా అందలేదని అరవబోయింది కాని కెమేరా చూసి నవ్వేసిందిగా'

'ఇంకా విచిత్రం— మునసబుగారి వంటవాళ్ళంతా వాళ్ళనికూడా సినిమా తియ్యకపోతే వంటలు మానేసి వీడియో వెనకాల తిరుగుతామని పేచీ పెడితే బతిమాలి సినిమా కాసేపు వాళ్ళవైపు తిప్పారట.

పెళ్ళి జరుగుతుంటే కాలంగాని కాలమయినా ఉరుములేని పిడుగులా పెద్ద వర్షం మొదలయింది. కాని ఎవరూ బిగుసుకుపోయి అంగుళంకూడా కదల్లేదు. నెత్తిమీద ధారాపాతంగా వర్షం పడుతున్నా పెళ్ళికొడుకూ పెళ్ళికూతురూ చిరునవ్వులు మానలేదు.

'బాబూ ఈ వానలో తీస్తే జనరేటర్‌లోంచి మంటలొస్తాయి. ఇంకా ఈ వర్షం ఎక్కువయితే కల్యాణమండపం కూలిపోయేలాగుంది. అంతా కిందకి పదండి' అంటూ మెట్లు దిగి కిందకి వెళ్తున్న వీడియో కుర్రాడి మాట వేదవాక్కులా పనిచేసింది అంతా హడావుడిగా తోసుకుంటూ పరిగెత్తారు.

ముహూర్తం పది నిమిషాలే ఉంది. పెళ్ళికొడు



## కొంటె కథ

కూ పెళ్ళికూతురూ చెట్టాపట్టాలేసుకుని కుంతివ్వ స్టైల్‌లో తడుస్తూ కిందకి పరిగెత్తారు. అయితే ఈ వర్షాన్ని ఆడపెళ్ళివారు బాగా ఉపయోగించుకున్నారు. కింద హడావిడిగా వేసిన పెళ్ళి పీటల వెనకాల చేరిపోయారు.

నాలుగుకేజీల పట్టుచీరలు వానకి తడిసి ఎనిమిది కేజీలయి కాళ్ళకి బంధాలు పడిపోతున్నా పరుగెడుతున్న పెళ్ళికొడుకు అక్కని, వదినని పట్టించుకున్నవాళ్ళేలేరు.

జీలకఱ్ఱ, బెల్లం పెట్టడం రాబోతోంది. ఈలోగా ఎవరో అరిచారు వీడియో మొదలెట్టలేదని, అంతే పెళ్ళికొడుకు పేచీపెట్టాడు ముందు వర్షంలో మిస్సయిపోయిన సీన్లన్నీ మళ్ళీ తీయాల్సిందేనని. పంతులుగారు 'ముహూర్తం దాటకూడదు నాయనా' అని గడ్డంపట్టుకు బతిమాలితే తప్ప

> వీడియో అనేసరికి రోజా ముప్పై ఏళ్ళ్లు మూలిగే మా ముత్తవ్వకూడా పాత ట్రంకు పెట్లోంచి ఇక్ష్వాకుల కాలంనాటి పట్టుచీర పైకి తీసి దులిపి చెంబిస్త్రీ చేసి తయారై పోతుందిరోయ్.

ఊరుకోలేదు. ముహూర్తం అవుతుండగానే కరంటు పోయింది. కిష్కింధకాండ మొదలయింది. ఇంతలో ఏవో కేకలు, ఒకరినొకరు తోసుకుంటున్న చప్పుడు— పెట్రోమాక్స్‌లైట్లు వెలిగేసరికి పెళ్ళి పీటల వెనకాల దెబ్బలాటలో రేగిపోయిన జుట్టులతో విజయగర్వంతో మగపెళ్ళివారు బైఠాయించేశారు. తలంబ్రాల సీనుకి బియ్యం పైనవానలో నానిపోయాయి. మళ్ళీ బియ్యం కావాలి మొఱ్ఱో మంటున్నా పంతులుగారి గోడు ఆడపెళ్ళివారు చిరునవ్వుతో బిగుసుకుపోయి వింటున్నారు తప్ప స్థానభ్రంశం అవుతుందని కదలడంలేదు. చివరికెవరో కేకలేసేసరికి తలంబ్రాల బియ్యం వచ్చాయి. అయితే చీమలున్న బియ్యమేమో పోటాపోటీ కెమెరాకేసి చూస్తూ తలంబ్రాలు పోసుకున్న వధూవరులు ఇక తట్టుకోలేక వీడియో కూడా మర్చిపోయి బుఱ్ఱలు గోకేసుకోడం మొదలెట్టారు.

వీడియోకుఱ్ఱాడు ఈ సీను భరించలేక వీడియోని ఒక అందంగా బంతిలా ఉన్న ఆరునెల్ల పాపాయికేసి తిప్పాడు. చిటికెలో గ్రహించేసిన జనం



నీ పని అంతే!

ఎలక్షన్లో గెలిచిన ఎమ్మెల్యేకి పార్టీ సెక్రెటరీ ఒక కారు ఇచ్చి ఇలా అన్నాడు.

"ఇదిగో ఎలక్షన్లో గెలిచినందుకు పార్టీ అధిష్టానవర్గం నీకు బహుమతిగా ఇచ్చిన కారు."

"కారు బాగానే ఉంది.. మరి దీనికి స్టీరింగ్ లేదేమిటి?"

"స్టీరింగ్ పార్టీ ప్రెసిడెంట్ దగ్గర ఉంటుంది.. నువ్వు స్టార్ట్ చేసి కూర్చుంటే చాలు"

— కె.వి.మధుసూదనరావు, కాకినాడ

పోటాపోటీగా ఆ కుఱ్ఱాడిని ఒక్కొక్కళ్ళూ ఎత్తుకుని ముద్దాడడం మొదలెట్టారు.

అప్పగింతలసీను మొదలయింది. పెళ్ళికూతురు బంధువర్గం అంతా సంప్రదాయం మార్చేసి పెళ్ళికొడుకు బంధువర్గానికి చిరునవ్వులు చిందిస్తూ అప్పగింతలు పూర్తి చేశారు. నేమురాలిటే దెబ్బతింటుందన్న వీడియో కుఱ్ఱాళ్ళమాట అంతా కొట్టిపారేశారు. సినిమాలో ఏడుస్తూ దిగితే ఏం బాగుంటుంది.

అలకపానుపుమీదకూడా పెళ్ళికొడుకు అలక మర్చిపోయి నవ్వులవాన కురిపించేడు. బహుమతుల సీనులో తొంభయ్యేళ్ళ ముత్తవ్వ రంగురంగుల పట్టుచీరతో పెళ్ళి కూతురిని ముద్దాడి బహుమతి అందించి కెమేరావాడివైపు చూసి నవ్వింది.

వళ్లగా నిగనిగలాడిపోతున్న జుట్టు, మీసాలతో ఆరవయ్యేళ్ళ వెంకటరాయుడు కంగారులో పెళ్ళి కూతురుకివ్వబోయిన బహుమతి పెళ్ళికొడుక్కిచ్చేసి షేక్‌హేండిచ్చేశాడు.

వర్షానికి నెత్తిమీద ఉన్న నాలుగు వరకాల జుట్టూ మొహానికతుక్కుపోయి జిడ్డుమొహంతో కుంకుమ మొహమంతా అయిపోయి మాంత్రికుడిలా ఉన్న పెళ్ళికొడుక్కి ఆ విషయం చెప్పే సాహసం ఎవరూ చెయ్యలేదు.

పదిరోజుల తర్వాత వీడియో కేసెట్టు తీసుకొస్తున్న మునసబుగారికి ఊరి మొదట్లోనే స్వాగత సన్నాహాల సంరంభం— మునసబుగారి ఇల్లు సినిమా హాల్లా తయారయింది. లాభంలేదని అమ్మవారి గుడి మంటపంలో వీడియో వేశారు. అయితే పెళ్ళి సినిమా చూస్తున్న ఊరంతా ముక్కున వేలేసుకుంది.

ఎంతసేపూ ఏవో గీతాలూ మెరుపులు కుయ్యి కుయ్యిమనే శబ్దాలు— మాంత్రికుళ్ళాంటి మనుషులూ వర్షం మాత్రమే వీడియోలో వచ్చింది తప్ప అంత కష్టపడి నటించిన సీన్లేవీ లేవు. పెళ్ళికూతురు బోర్లాపడిన దృశ్యం, వధూవరులు బుఱ్ఱలు గోక్కుంటున్న సీను బాగా వచ్చాయి.

అసలే ఇక్ష్వాకుల కాలంనాటి పెళ్ళి పట్టుచీర వానలో తడిసి పీలికలయిపోయిన ముత్తవ్వకి— కొత్తగా జుట్టుకి రంగేసినందుకు ఎలర్జీవచ్చిన వెంకటరాయుడికి, జనానికి బి.పి.పెరిగిపోయింది.

వాళ్ళు మునసబుగారి మీద దాడి చెయ్యబోయారు. కాని ఆయన పిచ్చిగా జుట్టుపీక్కుంటూ చెప్పారు— "ఆరోజు వీడియో కుఱ్ఱాళ్ళు జనాన్ని చూసి కంగారుపడిపోయి, సరిగ్గా మీటనొక్కకా, నానవల్లా సినిమా పడలేదట. పెళ్ళికొడుకు మళ్ళీ మొదట్నుంచీ పెళ్ళి చెయ్యమంటున్నాడు. మళ్ళీ పెళ్ళంటే ఏళ్ళైనేలు— ఏందారి భగవంతుడా!"

